# దగాపడ్డ విద్యార్థి



- తన ఉజ్వల భవిష్యత్తును అడ్డుకున్న నర్సింగ్ కాలేజీ
- అనధికారిక అడ్మిషన్‌కు తెరలేపిన కేసీరెడ్డి నర్సింగ్ కాలేజీ
- ఫీజు కట్టించుకుని యూనివర్శిటీకి విద్యార్థి వివరాలు అప్‌లోడ్ చేయని వైనం




విజయవాడ మేజర్ న్యూస్ : నర్సింగ్ చదువుకుని తన జీవితానికి ఉజ్వల బాట వేసుకుందామనుకున్న ఓ విద్యార్థిని గుంటూరు జిల్లాకు చెందిన కేసీరెడ్డి నర్సింగ్ కాలేజీ నిలువునా ముంచేసింది. వివరాలు ప్రకారం విజయవాడకు చెందిన షేక్ కాజా రియాజ్ 2025లో విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ రాసి అందులో ర్యాంకు సాధించారు. విద్యార్థికి వచ్చిన ర్యాంకు ఆధారంగా కన్వీనర్ కోటాలో ప్రకాశం జిల్లా మార్గాపురం మండలం దరిమగుడు గ్రామంలోని ధార్వి కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో ఫ్రీ సీటు వచ్చింది. కానీ కాజా రియాజ్ అందులో చేరలేదు. మేనేజ్‌మెంట్ కోటాలో గుంటూరు జనగంట్లుపాలెంలోని బాలాజీ ఎడ్యుకేషన్ సొసైటీ నడుపుతున్న కే సీ రెడ్డి కాలేజీలో డిసెంబర్ 2025న బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చేరాడు. అందుకు సంబంధించి 15.12.2025న ట్యూషన్‌ఫీజు రూ.15,000, 22వ తేదీన రూ. 10వేలు, మరో రూ.10 వేలు, 27.12.2025న రూ.5500,రూ.7,800 చెల్లించారు. కానీ మార్గాపురం కాలేజీలో అడ్మిషన్ తీసుకోనందున కాజా రియాజ్ అడ్మిషన్ రద్దు చేయాలని సదరు కాలేనీ ఎన్టీఆర్ హెల్త్ యూనిర్శిటీకి లెటర్ కూడా ఇచ్చింది. ప్రస్తుతం రియాజ్ చదువుతున్న కేజీ రెడ్డి కళాశాలకు యూనివర్శిటీ కేటాయించిన మేనేజ్‌మెంట్ కోటా సీట్లకంటే ఎక్కువ సీట్లు అనధికారికంగా భర్తీ చేసింది. తనకు అడ్మిషన్ కేటాయించాలని విద్యార్థి కళాశాల యాజమాన్యానికి మొరపెట్టుకుంటే యూనివర్శిటీలో తీసుకోవాలని డిసెంబర్ నుంచి సాగదీస్తు వచ్చారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సదరు విద్యార్థి నేరుగా యూనివర్శిటీకి వచ్చి వాకబు చేయగా యూనివర్శిటీ అడ్మిషన్ల విభాగం కేసీ రెడ్డి నర్సింగ్ కాలేజీ విద్యార్థుల వివరాల్లో కాజా రియాజ్ వివరాలు లేకపోవటంతో అసలు విషయాన్ని చెప్పింది. తనకు యూనివర్శిటీ కేటాయించిన సీట్లకంటే సదరు కాలేజీ అనధికారికంగా సీట్లు భర్తీచేసి అనధికారికంగా ఫీజులు వసూలు చేస్తుందని గ్రహించారు. కేసీ రెడ్డి నర్సింగ్ కళాశాల ఉద్దేశపూర్వకంగా తనను మోసం చేసి తన ఏడాది అకడమిక్ జీవితాన్ని నాశనం చేసిందని మీ దృష్టికి తీసుకువస్తున్నాం. విద్యార్థికి న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నాం.

## రాష్ట్రానికి ఆంధ్ర యూనివర్సిటీ ఒక గర్వకారణం



- విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- ఆంధ్ర యూనివర్సిటీని 'టాప్-10'లోకి తీసుకువస్తాం
- అసెంబ్లీలో మంత్రి నారా లోకేష్ హామీ

2

బీ.పీ.ఎల్ కుటుంబాల విద్యార్థులకు

## ఉన్నత విద్యలో ఇబ్బందులు

- జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలి
- రూ.20 కోట్లతో అభివృద్ధి సాధ్యం
- సభలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఉమ ప్రస్తావన



విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ : శుక్రవారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేష్, మిగతా 2లో...



గ్రేటర్ అయ్యేలోపు..

## నగరాన్ని అభివృద్ధి చేస్తాం



- నేషనల్ హైవే, కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలన
- బెంజ్ సర్కిల్ పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పూర్తిస్థాయిలో చర్యలు
- పటమట లంక నుంచి ఎమ్.జి రోడ్డుకి ఫ్లై ఓవర్ కింద రోడ్డు ఏర్పాటు
- మార్చి 15వ తేదీన ఎ.కొండూరు మండలంలో వాటర్ ట్యాంకులు ప్రారంభోత్సవం
- మార్చి 15వ తేదీన ఎ.కొండూరు మండలంలో వాటర్ ట్యాంకులు ప్రారంభోత్సవం
- కమ్యూనిస్టు నాయకులు నిర్మాణాత్మక విమర్శలు చేయాలని ఎంపీ సూచన

వివరాలు 2లో..

(మొదటిపేజీ తరువాయి)



## రాష్ట్రానికి ఆంధ్ర యూనివర్సిటీ ఒక గర్వకారణం

**గన్నవరం, ఫిబ్రవరి 27, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆంధ్ర యూనివర్సిటీ (ఏయూ) ఒక గర్వకారణమని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజక వర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శాసనసభలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 1923లో స్థాపించబడిన ఆంధ్ర బ్యాంక్ వేరే బ్యాంకులో విలీనమై తన పేరును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మన రాష్ట్రానికి ఆంధ్ర అనే పేరు మీద గర్వకారణంగా మిగిలింది కేవలం ఆంధ్ర యూనివర్సిటీ ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు. అందుకే ఈ చారిత్రక విశ్వవిద్యాలయానికి భారీగా నిధులు కేటాయించి, మరింత బలోపేతం చేయాలని మంత్రి నారా లోకేష్ ను కోరారు. అనంతరం మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలన లో ఆంధ్ర యూనివర్సిటీని వైకాపా పార్టీ కార్యాలయంగా మార్చడం వల్ల దాని ప్రతిష్ట మసకబారిందని విమర్శించారు. ఫలితంగా 2019లో 29వ స్థానంలో ఉన్న ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, 2023 నాటికి 76వ స్థానానికి పడిపోయిందని వివరించారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న చర్యలతో ప్రస్తుతం మళ్ళీ 41వ ర్యాంకుకు చేరుకుందని, త్వరలోనే దీనిని దేశంలోని టాప్-10 యూనివర్సిటీల జాబితాలోకి చేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఏయూలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని, రాబోయే 45 రోజుల్లో నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. యూనివర్సిటీల్లో సిబ్బంది నియామకాలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలపై స్పష్టత కోసం 30 రోజుల్లో మ్యాన్ పవర్ ఆడిట్ పూర్తి చేస్తామన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ 100 ఏళ్ల వేడుకలను రాష్ట్రస్థాయిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ చర్యల ద్వారా ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకువచ్చి, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

### బీ.పీ.ఎల్ కుటుంబాల విద్యార్థులకు

## ఉన్నత విద్యలో ఇబ్బందులు

వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో విజయవాడ పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ పేరుమీద మధ్యాహ్న భోజన పథకం ఘనంగా ప్రారంభమైన విషయాన్ని సభలో ప్రస్తావించారు. ఆ కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ స్వయంగా హాజరై కళాశాల పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు.. సుమారు 2 లక్షల జనాభా ఉన్న ఈ ప్రాంతానికి ప్రభుత్వం తరఫున ఒకే ఒక్క జూనియర్ కళాశాల మాత్రమే ఉందని, ఇక్కడి ప్రజల్లో అధిక సంఖ్యలో బీ.పి.ఎల్ కుటుంబాలకు చెందిన పేదవారు ఉన్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. మా సెంట్రల్ నియోజకవర్గ ప్రజల తరఫున పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇది అత్యవసరమైన అవసరమని, సుమారు రూ.20 కోట్ల వ్యయంతో డిగ్రీ కళాశాలగా అభివృద్ధి చేయవచ్చని సభలో తెలిపారు.. ఈ అంశాన్ని ఇంతకుముందే సభ ద్వారా ప్రస్తావించినట్లు గుర్తుచేసి, కళాశాలను పరిశీలించిన సందర్భంలో కూడా మంత్రి నారా లోకేష్‌కి ఈ అభ్యర్థన తెలియజేసినట్లు పేర్కొన్నారు.. కాబట్టి సెంట్రల్ నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను గౌరవించి, పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను వెంటనే డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రిలని మరొక్కసారి విజ్ఞప్తి చేశారు.

# గ్రేటర్ అయ్యేలోపు నగరాన్ని అభివృద్ధి చేస్తాం



**విజయవాడ మేజర్ న్యూస్ :** విజయవాడ గ్రేటర్ కాక ముందే తాగునీటి , స్ట్రాంమ్ వాటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలతో పాటు నగరాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, సుజనా చౌదరిలతో కలిసి కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ లోని ప్రధాన రద్దీ ప్రాంతమైన బెంజ్ సర్కిల్, లారీ ఓనర్స్ హాల్, జ్యోతి కన్వెన్షన్ హాల్ పరిసరాల్లో వాహనాలు, స్థానికులు రాకపోకలు సాగించడానికి అనువుగా ఉండేలా చర్యలు తీసుకునేందకు శుక్రవారం నేషనల్ హైవే పిడి తో కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ లతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీకేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగులు పడుతున్నాయని వెల్లడించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, చెన్నుపాటి గాంధీ తదితరులు జాతీయ రహదారి ప్రాజెక్ట్ డైరెక్టర్, కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్‌లతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించటం జరిగిందన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన లారీ ఓనర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం పార్కింగ్ స్థలం సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పటమటలంక వాసులు స్క్రూ-బ్రిడ్జ కింద నుంచి ఇటువైపునకు రావడానికి వీలుగా రోడ్డు మార్గం కావాలని నేషనల్ హైవే అధికారులను కోరగా అందుకు సమ్మతించినట్లు తెలిపారు. హైవే వెంట గ్రీనరీ అభివృద్ధికి ముందుకొచ్చినందుకు లారీ ఓనర్స్ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, మున్సిపల్, నేషనల్ హైవే శాఖలతో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. రెండు నెలల్లో ప్రస్తుత సమస్యల పరిష్కారానికి చర్యలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కొత్త బస్ స్టాండ్ నుంచి స్క్రూ బ్రిడ్జి వరకు, అలాగే కనకదుర్గమ్మ వారధి వద్ద జనాలు దిగేందుకు, ఎక్కేందుకు వీలుగా ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదన సమర్పించామని వెల్లడించారు. దీనికి సంబంధించి 'ఇన్ ప్రిన్సిపల్'గా మినిట్స్ నమోదు చేసి అధికారులకు పంపినట్లు తెలిపారు. అంతకుముందు గద్దె రామారావుతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం లభిస్తే ఫ్లైఓవర్ నిర్మాణం వేగవంతమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో కృష్ణలంక ప్రాంతానికి చెందిన లక్షన్నర మందికి పైగా ప్రజలకు ఎంతో ప్రయోజనంగా వుంటుందని పేర్కొన్నారు. వెస్టర్న్ బైపాస్ పూర్తి కావడం, బెంజ్ సర్కిల్ నుంచి గంగూరు వరకు, అలాగే బెంజ్ సర్కిల్ నుంచి కొత్త బస్ స్టాండ్ వరకు ప్రతిపాదిత ఫ్లైఓవర్లు పూర్తి అయితే నగర ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

### కమ్యూనిస్టులు నిర్మాణాత్మక విమర్శలు చేయాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తాను కృష్ణలంకలో అండర్‌పాస్‌ల నిర్మాణంపై పదేపదే విజ్ఞప్తి చేయడంతో జాతీయ రహదారి అధికారులు రాణిగారి తోట వద్ద సబ్‌వేను మంజూరు చేశారని తెలిపారు. ప్రమాదాలకు కేంద్రంగా మారిన ఆ ప్రాంతంలో భద్రతా సమస్యలు సబ్‌వే నిర్మాణంతో తొలగిపోతాయని చెప్పారు. శుక్రవారం టెండర్లు తెరవనున్నట్లు వెల్లడించారు. ఈ దశలో ఇప్పుడే నిద్ర లేచినట్లు సిపిఐ, సిపిఎం ఎందుకు ధర్నాలు చేస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. గత ఐదేళ్లలో నగర అభివృద్ధిపై స్పందించని సీపీఐ, సీపీఎం నాయకులు ప్రస్తుతం విమర్శలు చేయడం విచారకరమని అన్నారు. నిర్మాణాత్మక విమర్శలు స్వాగతిస్తామని, అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా చూడాలని సూచించారు.

### మరో 10 రోజుల్లో నగరానికి పట్టిన చీడ పోతుంది

నగరాభివృద్ధికి రూ.3 వేల కోట్ల తో డి.పి.ఆర్. తయారు చేయటానికి ఒప్పుకోని మున్సిపల్ కౌన్సిల్ నగరానికి పట్టిన చీడ అంటూ మండిపడ్డారు. మరో పది రోజుల్లో ఆ చీడ పోతుందని..ఆర్.యు.బి, ఆర్.వో.బి, సబ్ వే లు, డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్ లకు సంబంధించిన డిపిఆర్ లు రెడీ అవుతున్నాయన్నారు.

### మార్చి 15వ తేదీ ప్రారంభోత్సవం

అలాగే జి.కొండూరు పరిసర ప్రాంతాల్లో 18 గ్రామాలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన వాటర్ ట్యాంకులు మార్చి 15 ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కిడ్నీ బాధితుల కోసం ట్యాంకర్లతో మంచి నీరు అందిస్తున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన కాంట్రాక్టులను పునఃప్రారంభించి పనులు వేగవంతం చేశామని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా నది నుంచి నీటిని సరఫరా చేసే ప్రాజెక్ట్‌కు చివరి దశ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మార్చి 15కల్లా అన్ని గ్రామాల్లో, అన్ని హ్యాబిటేషన్స్ లోనూ ఎక్కడైతే షెడ్యూల్ ట్రైబ్స్ ఉన్నారో ఇబ్రహీంపట్నం నుంచి కృష్ణనది నీళ్లు అందించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ బెంజ్ సర్కిల్ నగరానికి ప్రధాన కూడలి కాగా, దాదాపు 68 ఏళ్లుగా ప్రతిష్టాత్మక ప్రాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. 2014-19 కాలంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషితో డబుల్ ఫ్లైఓవర్ నిర్మాణం జరిగిందని, దాని వల్ల కొంతమేర ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమైనప్పటికీ రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా మరిన్ని చర్యలు అవసరమని వివరించారు. ప్రస్తుతం ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కనకదుర్గమ్మ ఆలయం సమీపం నుంచి బెంజ్ సర్కిల్ వరకు, అలాగే బెంజ్ సర్కిల్ నుంచి పెనమలూరు, గోశాల వైపు వెళ్లేలా కొత్త ఫ్లైఓవర్ ప్రతిపాదనను కేంద్రానికి పంపినట్లు తెలిపారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ "ప్రతిపాదన పంపించండి, శాంక్షన్ చేసే బాధ్యత నాది" అని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అధికారిక ఆమోదం వచ్చిన తర్వాత పూర్తి వివరాలు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్, జ్యోతి కన్వెన్షన్ ప్రాంతంలో అధిక రద్దీ ఏర్పడుతున్న నేపథ్యంలో ఫ్లైఓవర్ కింద ప్రత్యేక సర్వీస్ రోడ్లు, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపై ఎంపీ కేశినేని శివనాథ్ నేషనల్ హైవే పీడీ, మున్సిపల్ కార్పొరేషన్ సీఈ, ఎంపీ, స్థానిక కార్పొరేటర్ క్రాంతి శ్రీ , టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాంధీ సమక్షంలో సమగ్ర చర్చలు జరిపినట్లు తెలిపారు. చంద్రమౌళి నగర్, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు అటు నుంచి ఇటు వెళ్లేందుకు అనేక మార్గాలపై సూచనలు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులను కూడా కలుపుకొని సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాంధీ , కార్పొరేటర్లు చెన్నుపాటి క్రాంతి శ్రీ, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయి బాబు, టిడిపి నాయకులు నాగమోతు రాజా, కె.వి.రమేష్, వై.వి.ఈశ్వరరావు, కె.వి.రామారావు, చెన్నుపాటి వజీరు, సత్యనారాయణ, చిలకలపూడి లక్ష్మణరావు,రమణ, లక్ష్మణ్ స్వామి,శరత్, చలపతిరావు, సూరపనేని సురేష్, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, టి.ఎన్.ఎస్.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఒక దేశ అభివృద్ధిలో విద్య, పరిశ్రమల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో త్వరలో నిర్వహించనున్న అమ్మకందారులు కొనుగోలుదారుల సమ్మేళన కార్యక్రమం వ్యాపార అభివృద్ధికి ఊతం అందిస్తుందని, కార్యక్రమంలో పాల్గొని వ్యాపార మెళకువలు పొందాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్వయం సహాయక సంఘాల వ్యాపారస్థులకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో జిల్లాలోని స్వయం సహాయక సంఘాల వ్యాపారస్థులకు నిర్వహించిన వ్యాపార మెళకువలు అవగాహన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక దేశ అభివృద్ధిలో విద్య, పరిశ్రమల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ ఆ దిశగా స్వయం సహాయక సంఘాల వ్యాపారాలను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకు వెళ్లేందుకు ఒక వేదిక ఏర్పాటు చేశామని తెలిపారు. దీనికోసం వచ్చే నెల మార్చి 10వ తేదీన పెనమలూరు మండలం కానూరులోని విఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో అమ్మకందారులు కొనుగోలుదారుల సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వ్యాపారస్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొని మార్కెటింగ్ సౌకర్యం, రుణ సౌకర్యం, ఉత్పత్తుల కొనుగోలులో వినియోగదారుల ప్రాధాన్యతలు, వివిధ రకాల ఉత్పత్తుల తయారీ తదితర అంశాలలో వ్యాపార మెళకువలు పొంది తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వ్యాపారంలో ఎలాంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తినా గట్టి సంకల్పంతో ముందుకెళ్తే విజయం సాధించవచ్చని, అలాంటి



అవరోధాలను ఎలా అధిగమించాలో, లైసెన్స్ పొందడం, తమ వ్యాపారానికి సంబంధించిన ఉత్పత్తులను నాణ్యతగా, ఆకర్షణీయంగా మలిచి వినియోగదారులను ఆకట్టుకునే వ్యాపార వ్యూహాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో సలహాలు, సూచనలు అందించడానికి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమం ప్రయోగాత్మకంగా చేపట్టామని, వ్యాపారస్తులందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, డి ఆర్ డి ఎ పి డి హరిహర నాథ్, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డిఐసి జిఎం ఆర్ వెంకట్రావు, జడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్ కుమార్, పశుసంవర్ధక, ఉద్యాన, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు చిన్న నరసింహులు, జె జ్యోతి, షేక్ షాహిద్ బాబు, మార్క్ఫెడ్ డిఎం మురళీ కిషోర్, మార్కెటింగ్ ఎడి నిత్యానంద్, ఎల్ డి ఎం రవీంద్రారెడ్డి, బ్యాంక్ అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వైద్య అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలి

**ఏకలవ్య స్కూల్ ఐటిఐ కాలేజీ మంజూరు చేయాలి**

**ఏ. కొండూరు ప్రాథమిక వైద్య శాల బిల్డింగ్ మంజూరు చేయాలి**

**రాష్ట్ర గిరిజన నాయకులు బి.గోపిరాజు**

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** ఏ. కొండూరు మండలంలో గిరిజనులు అధికంగా ఉన్నపటికీ విద్య, వైద్యానికి ఆమడ దూరంలో ఉన్నారని రాష్ట్ర గిరిజన నాయకులు బి గోపిరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంతతో పాటు చుట్టుపక్కల మండలాల్లో గిరిజనుల గ్రామాలు ఉన్నాయన్నారు.ఎన్టీఆర్ జిల్లాలో గిరిజనులు అధికంగా ఉన్న ఏ కొండూరు మండలంలో ఏకలవ్య స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ పాఠశాల ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాలుగా రాష్ట్ర, కేంద్ర ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ గిరిజన విద్యార్థుల విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు అన్నారు. ఏకలవ్య స్కూల్ ఏర్పాటు చేయుటకు ప్రభుత్వ భూములు పుష్కలంగా ఉన్న కొంతమంది అధికారులు స్కూలు ఏర్పాటు చేయుటకు అనుకూలంగా స్థలాలు లేవని తప్పుడు రిపోర్టులు పంపిస్తున్నారని తెలిపారు. ఏ కొండూరు మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులు (ఐటిఐ కాలేజీ) నైపుణ్య విద్య అందుబాటులో లేకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లలేక మధ్యలో చదువు మానేసి కార్మికులుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిఐ కాలేజ్ ఏర్పాటు చేస్తే స్కిల్ నైపుణ్యం కోర్సు చదివి



ప్రైవేటు రంగాల్లో ఉపాధి పొందడానికి ఆర్థికంగా బలపడడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏ కుండూరు మండలంలో ఏకలవ్య స్కూల్ తో పాటు ఐటిఐ కాలేజీ మంజూరు చేయాలన్నారు. ఏ కొండూరు మండలంలో వైద్యరంగంలో ప్రభుత్వపరంగా ప్రాథమిక వైద్యశాల పూర్తిస్థాయిలో సౌకర్యలు లేకపోవడంతో పాటు బిల్డింగు కొత్తగా మంజూరు చేసి ఈ హాస్పిటల్ ను 25 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.



## బాలమ్మ-శివయ్యలకు ప్రత్యేక అలంకారాలు

**మొవ్వ మేజర్ న్యూస్:** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి 263 వార్షిక కళ్యాణోత్సవాలవేడుకలలో భాగంగా శుక్రవారం శాశ్వత ఉభయ దాతలు నాట్య లెజెండ్ పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం-స్వరాజ్యలక్ష్మి దంపతుల కుటుంబ సభ్యులు అందించిన నూతన వస్త్రాలతో పెండ్లి కుమారుడు పెళ్లికూతురుగా తీర్చిదిద్దారు. దేవాలయ పాలకమండలి అధ్యక్షులు కావూరి భానుమూర్తి, సభ్యుడు చింతా రామ్మూర్తి ఆధ్వర్యంలో అర్చకులు పెనుమూడి పూర్ణ చంద్రశేఖర శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ అలంకరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు చింతలపాటి రామకృష్ణ సావిత్రి దంపతులు, గ్రంథాలయ పాలకులు వైవిణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక సత్య వ్రతాలు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి ఆలయ ఆవరణలోని ఆస్థాన మండపంలో ఫాల్గుణ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతాలను వైభవంగా జరిపించారు దాదాపు 30 మంది దంపతులు పాల్గొనగా అర్చక స్వామి దీవి నరసింహా మూర్తి వ్రతాలను నిర్వహించి వాటి యొక్క ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు దంపతులు ఉచితంగా పూజా సామాగ్రి అందించారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ వాసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## వంతెన పై ఇసుక... వాహనదారులు ఇక్కట్లు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** పంచాయతీ పరిధిలోని లంకమ్మ మాన్యం వద్ద పంట కాలువపై నిర్మించిన వంతెన పై పేరుకుపోయిన ఇసుక వలన వాహన దారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మండల కేంద్రమైన అవనిగడ్డ నుండి లంకమ్మ మాన్యం, అశ్వరావు పాలెం గ్రామాలకు వెళ్లేందుకు ఈ వంతెన పైనుండి వెళ్లవలసి ఉంది. ఎవరు పోస్తున్నారో తెలియదు కానీ పెద్ద పెద్ద టిప్పర్లతో వంతెనపైన ఇసుక దంపు చేసి అనంతరం వారికి అవసరమైన చోటకు ట్రాక్టర్ల పై తీసుకు వెళ్ళడం ఆనవాయితీగా జరుగుతున్నదని ప్రయాణికులు చెప్తున్నారు. డంప్ చేసిన ఇసుకను తరలించినప్పటికీ వంతెన మొత్తం మిగిలిన ఇసుక పేరుకుపోయి ఉండటంతో వాహనాలు స్కిడ్ అయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

## ఫ్యాబ్రిక్ ప్రింటింగ్, డయ్యింగ్ పై శిక్షణ

ఘంటసాల, మేజర్ న్యూస్ : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల వారి అద్వర్యం లో చిట్టూర్పు గ్రామంలోని మహిళలకు ఫ్యాబ్రిక్ ప్రింటింగ్ డయ్యింగ్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త వివిధ రకాల ప్రింటింగ్ విధానాలు, అలాగే సహజ వర్ణ ద్రవ్యాలు, రసాయన రంగులు, రంగు స్థిరత్వం, వస్త్రాల ఎంపిక, ఖర్చు లెక్కలు, ప్యాకేజింగ్ విక్రయ విధానాలను సహజ రంగుల వినియోగం పై అవగాహన కల్పించడం జరిగింది. శిక్షణాలో భాగంగా టై అండ్ డై, బాటిక్ ప్రింటింగ్, బ్లాక్ ప్రింటింగ్, స్క్రీన్ ప్రింటింగ్ వంటి పద్ధతులను వివరించి, టై అండ్ డై టెక్నిక్స్ ఉపయోగించి రంగులు అద్దడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడపాటి వెంకటేశ్వరరావు,ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, సెక్రెటరీ అబ్దుల్ నయీం, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## లంకతోటలో వైభవంగా శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం పాగోలు శివారు లంకతోట గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. 25వతేదీ నుంచీ ప్రతిష్టామహో త్సవాలు ప్రారంభం కాగా, శుక్రవారం ఉదయం గం.11.31లకు పునర్వసు నక్షత్రయుక్త వృషభ లగ్నమందు శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామివార్ల విగ్రహ స్థిరప్రతిష్టను వేదపండితులు లవకుమార్ శాస్త్రోక్త టగా నిర్వహించారు. విగ్రహాల దాత బొప్పిడి కిషోర్బాబు, ఉభయదాతలు వీర్ల కార్తికేయ, వీర్ల నాగమ ఎనీశ్వరరావు, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, దేవనబోయిన బాబ్జీ, వీర్ల వెంకటసుబ్బయ్య దంపతులు ప్రతిష్టా కార్యక్రమాలు చేశారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం కళాన్యాసము, స్వామివార్ల దర్శనము, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధాన జరిగింది. కార్యక్రమాలను కమిటీ పెద్దలు వీర్ల మధు, వెంకట్రామయ్య,





వీరబాబు, శ్రీనివాసరావు, దేవనబోయిన వెంకటేశ్వరరావు ప్రభృతులు పర్యవేక్షించారు. ప్రతిష్టామహోత్సవంలో ఎమ్మెల్యే తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్ పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ మేకా బంగారుబాబు, సొసైటీ ఛైర్మన్ బొందలపాటి వీరబాబు, నేతలు పరిశె మౌళి, మోర్ల శివ, వేమూరి గోవర్ధన్ తదితరులు పాల్గొని ప్రతిష్టామూర్తులను దర్శించుకున్నారు.

## నూతన ఆవిష్కరణలతో కుటుంబ వ్యాపారాల వృద్ధి

**విజయవాడ మేజర్ న్యూస్ :** కుటుంబ యాజమాన్యంలోని వ్యాపారాలు భారతదేశ స్థూల జాతీయోత్పత్తిలో మూడు వంతుల కన్నా ఎక్కువ వాటాను అందిస్తుండగా, 2047నాటికి దేశాభివృద్ధిలో మరింత పెద్ద పాత్ర పోషిస్తాయని అంచనా. అయితే, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ విడుదల చేసిన నూతన అధ్యయన నివేదిక ప్రకారం, పలు మధ్య తరహా కుటుంబ సంస్థలు స్వల్పకాలిక లాభాలపై అంటే, ఈబీఐటీడీఏపై మాత్రమే దృష్టి సారించడంతో భారతదేశం పెరుగుతున్న ఆర్థిక వృద్ధిని ఇంకా పూర్తిగా అందిపుచ్చుకోలేకపోతున్నాయి. బిజినెస్ ఇన్నోవేషన్- యాన్ ఇంపరేటివ్ ఫర్ ఇండియన్ ఫ్యామిలీ-లెడ్ బిజినెసెస్ పేరిట ఐఎస్‌బి విడుదల చేసిన కొత్త నివేదిక, కుటుంబాలు నిర్వహించే సంస్థలు స్థానిక, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకగా కొనసాగుతున్నప్పటికీ, చాలా వరకు పెరుగుతున్న వృద్ధి నమూనాలపై ఆధారపడుతూ, అధిక వృద్ధి రంగాలలోని అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకోవడం లేదు. బలమైన కార్యాచరణ పునాదులపై నిర్మించబడినప్పటికీ మార్కెట్‌లను సృష్టించడం, కనిపించని ఆస్తులలో పెట్టుబడి పెట్టడం, వారి ప్రధాన వ్యాపారానికి అనుగుణంగా భవిష్యత్తు ఆదాయ నమూనాలను రూపొందించడం అనే దృష్టి, ఆశయం లేని మధ్య తరహా సంస్థలలో ఈ అంతరం ఎక్కువగా కనిపిస్తుంది.

## సమస్యల పరిష్కారానికి ఎపిటిఎఫ్ నిరసన




**మొవ్వ మేజర్ న్యూస్ :** ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రమైన మొవ్వ తహసిల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని, లేనియెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉపాధ్యాయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏపిటిఎఫ్ నాయకులు ఇ.వి. రామారావు, పలువురు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం తహసిల్దార్ కే.మస్తాన్ కు వినతిపత్రం అందించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వసంత



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం రాయనపాడు గ్రామ వాస్తవ్యులు వేముల రంగారావు, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు రాకేష్, పున్వితల వివాహ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం వారి నివాసంలో ప్రత్యేకంగా వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గీతా మందిరంలో భగవద్గీత పారాయణం



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఫాల్గుణ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సామూహిక భగవద్గీత పారాయణం చేశారు. శుక్రవారం స్థానిక గీతా మందిరంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు గీత లోని 18 అధ్యాయాలు పారాయణం చేశారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం శ్రీ లక్ష్మీ లలిత సహస్రనామ స్తోత్ర పారాయణాలు నిర్వహిం చారు. రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారికి విశేష అలంకరణలు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఆలయ ధర్మకర్త హరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# సంజీవని వైద్య సేవలు అభినందనీయం



## కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ







**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నాట్య క్షేత్రం కూచిపూడి గ్రామంలో గల రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ డీ.కే. బాలాజీ శుక్రవారం ఆరా తీశారు. ప్రముఖ నాట్య క్షేత్రమైన కూచిపూడిలోని రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వైద్యాలయంలోని అత్యవసర విభాగం, ఆపరేషన్ థియేటర్, ఎక్స్ రే, కార్డియో తోరాసిక్, ప్రసూతి విభాగం, క్యాంటీన్ తదితర విభాగాలను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి కలెక్టర్ ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ వైద్యం బాగా చేస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఎక్కడనుంచి వస్తున్నారని కలెక్టర్ అడుగగా పామర్రు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చామని చెప్పారు. ప్రసూతి విభాగంలో తల్లి పిల్లలను కూడా కలెక్టర్ విచారించి వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందరూ బాగున్నామని, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చామని మొదటి నుంచి ఈ వైద్యాలయంలోనే వైద్య పరీక్షలు చేయించుకుంటున్నామని కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా వైద్యాలయం వ్యవస్థాపక అధ్యక్షులు సీఈవో డాక్టర్ కూచిభట్ల ఆనంద్ మాట్లాడుతూ 2018 సంవత్సరంలో దాతల సహకారంతో ఈ వైద్యాలయాన్ని ఆహ్లాదకర గ్రామీణ వాతావరణంలో నిర్మించామని జిల్లా కలెక్టర్‌కు వివరించారు. రోజుకు సుమారు 450 మంది ప్రజలు వైద్య చికిత్స కోసం వైద్యాలయానికి వస్తుంటారని వివరించారు. ఒక మంచి అధికారి ఉంటే దేశం బాగుపడుతుందని విన్నాము.

కాని ప్రస్తుతం నేరుగా మిమ్మల్ని చూస్తున్నామని అంటూ జిల్లా కలెక్టర్‌ను అభినందించి శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఒక వ్యవస్థ బాగా నడవాలంటే మంచి నాయకుడు అవసరమని, జిల్లా కలెక్టర్ జిల్లా అధికార యంత్రాంగాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. వైద్యాలయంలో డయాలసిస్ రోగులకు తప్ప మిగిలిన వారందరికీ ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుతున్నాయని డయాలసిస్ రోగులకు కూడా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ కు ఆనంద్ విజ్ఞప్తి చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని సీఈఓకు సూచించారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు జిల్లా కలెక్టర్ జిల్లా అభివృద్ధికి అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటరమణ విజయలక్ష్మి, మండల తహసీల్దార్ కె. మస్తాన్, ఎంపీడీఓ డి. సుహాసిని, సిలికానాంధ్ర వైద్యాలయం ఏఓ హనుమ కుమార్, మేనేజర్ సత్య ప్రకాష్, సిద్దేంద్ర యోగి నాట్య కళా పీఠం లైబ్రేరియన్ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.







## నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీ ఆర్ ఓ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక జిల్లా కోర్ట్ సెంటర్లోని రెవెన్యూ కళ్యాణ మండపంలో కలెక్టరేట్ పరిపాలన అధికారిని ఎ ఓ కుమారుడు వివాహ రిసెప్షన్‌కు హాజరై వధూవరులను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, తదితరులు ఆశీర్వదించారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్టీవో



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసిన బందరు నూతన ఆర్టీవో కె.సాంబశివరావు, ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా బందరు ఆర్టీవోగా సాంబశివరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

## పాతమాజేరులో చురుకుగా జనసేన సభ్యత్వ నమోదు

### జనసేనలో చేరిన వైసీపీ వార్డు సభ్యురాలి భర్త



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** మండలం పాతమాజేరులో జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుకుగా సాగుతోంది. శుక్రవారం ఈ శిబిరాన్ని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ సందర్శించి, సభ్యత్వ నమోదు చేపట్టిన పార్టీ సాధకులను అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ సమక్షంలో వైసీపీ నుంచి 11వ వార్డ్ సభ్యురాలి భర్త తిరుమలశెట్టి గంటేశ్వరరావు జనసేన పార్టీలో చేరి, పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ సభ్యత్వాలు రెన్యూవల్ చేయించుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చోడగం విమల్ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు తిరుమలశెట్టి బాల నాగేశ్వరరావు, బొందలపాటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపకరిస్తుంది



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** డ్రోన్‌ల సాంకేతిక పరిజ్ఞానంతో పొలాల్లో విత్తనాలు విత్తడం ఎంతో సులువు, ప్రయోజనకరం అని, ఆ దిశగా రైతులు అవకాశాలను అందిపుచ్చుకొని లబ్ది పొందాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కోరారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ మండల వ్యవసాయ అధికారులు, రైతు సాధికార సంస్థ సిబ్బంది, రైతులకు డ్రోన్ల వినియోగంపై నిర్వహించిన కార్యశాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రుతుపవన వర్షాలకు ముందు (ప్రీ మాన్‌సూన్ డ్రై సీడింగ్ పీఎండీఎస్) పొడి నేలలో 30 నుంచి 32 రకాల మిశ్రమ విత్తనాలను పొలంలో చల్లేందుకు డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపకరిస్తుందని, దీనివల్ల సమయం ఆదాతో పాటు కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటికే గన్నవరం మండలం, వీరప్పనేని గూడెంలో ప్రయోగాత్మకంగా చేపట్టామని వివరిస్తూ దీనిపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పొలంలో మొలిచిన మొక్కలను కొంత కాలానికి భూమిలో కలియ దున్నడం ద్వారా నేల సారవంతంగా మారి, ఎరువుల వినియోగం తగ్గుతుందన్నారు. రైతు సేవ కేంద్రాల వారీగా ఆసక్తిగల రైతులను గుర్తించి విస్తీర్ణం ఆధారంగా అవసరమైన విత్తన నిల్వలను ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా రీజినల్ అగ్రికల్చర్ రిసర్చ్ స్టేషన్ వ్యవసాయ శాస్త్రవేత్త సాంబయ్య డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ఎన్ పద్మావతి, జె జ్యోతి, ప్రకృతి వ్యవసాయం డిపిఎం పార్థసారథి, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి సుధారాణి, ఏడి మణిధర్, మండల వ్యవసాయ అధికారులు, రైతు సాధికార సంస్థ సిబ్బంది, రైతులు, డ్రోన్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మౌలిక సదుపాయాలకు చారిత్రాత్మక పెట్టుబడులకు కూటమి విశేష కృషి




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని శుక్రవారం మచిలీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, వైసిపి వైఫల్యాల నుంచి రైతును కాపాడిన బాధ్యతాయుత ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వం అన్నారు. వ్యవసాయం భవిష్యత్తుకు బలమైన పునాది అని, అలాంటి వ్యవసాయం మీద ఆధారపడిన రైతుల కోసం కూటమి ప్రభుత్వం అనేక విప్లమాత్మక మార్పులు తెస్తూ రైతులకు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అండగా ఉంది అన్నారు. గత ఐదేళ్ల విధ్వంసకర పాలన తర్వాత రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నడిపిస్తున్నారు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం నిజమైన స్వర్ణ యుగాన్ని పొందిందని, రైతులకు నేరుగా లాభాలు, ఆధునిక సాగు పద్ధతులు, పంటల మార్కెటింగ్ సౌకర్యాలు లాంటి సమగ్ర పథకాలు రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబానికి ఆర్థిక స్థిరత్వాన్ని అందిస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం దృఢమైన నాయకత్వం ఫలితంగా ప్రతి పంట లోను, ప్రతి రైతులోనూ గర్వం, నమ్మకాన్ని పెంపొందిస్తూ వ్యవసాయ రంగాన్ని అత్యాధునిక శిఖరాలకు కూటమి ప్రభుత్వం తీసుకువెళ్తోంది అన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకుని బీమా, రుణ సౌకర్యం, పరిశోధనాత్మక పద్ధతులు వంటి పథకాలను మరింత బలోపేతం చేసి, ప్రతి రైతు వారి కుటుంబాన్ని బలోపేతం చేసుకునే విధంగా లాభాలు పొందుతున్నారు అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధికి కేంద్ర బిందువుగా భావించి కనీసం 15% వార్షిక వృద్ధి సాధించాలనేటటువంటి స్పష్టమైన లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది అన్నారు. ప్రభుత్వం డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్లు, రోబోటిక్స్, ఉపగ్రహ ఆధారిత వ్యవస్థల వంటి ఆధునిక సాంకేతికతల ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా, అధిక ఆదాయ రంగంగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారు అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నవంబర్ 25 న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించడం జరిగిందని, నీటి భద్రత, డిమాండు ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే అంశాలకు అధిక ప్రాధాన్యత కల్పించడం జరిగింది అన్నారు. 2025 నవంబర్ 24 నుండి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతన్న మీకోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నాము అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు సేవ కేంద్రాల స్థాయిలో పంటల ప్రణాళిక వర్క్ షాపులు నిర్వహించి రాబోయే మూడు సీజన్ రబీ 2025,26 ఖరీఫ్ 26, రబీ 2026,27 కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడం జరుగుతుంది అన్నారు. రైతుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, తెలుగుదేశం పార్టీ తెలుగు రైతు మచిలీపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు, చిల్ల సీతారామయ్య, టిడిపి నాయకులు, కొల్లు రంగ, వాటపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు జాతి పశువులకు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉంది



**తిరుపతి దేవస్థానం ద్వారా ఒంగోలు ఆవుల సంరక్షణ బాధ్యత చేపట్టాలి.**

**శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు**

**గన్నవరం, ఫిబ్రవరి 27, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమైన ఒంగోలు జాతి పశువులు ప్రస్తుతం అంతరించిపోయే దశలో ఉన్నాయని, వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గన్నవరం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ లో మాట్లాడుతూ ఒంగోలు జాతి ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందని, మన రాష్ట్రంలో పుట్టిన ఈ జాతిని బ్రెజిల్ దేశం 'నెలోర్' పేరుతో అభివృద్ధి చేసి మాంసం ఎగుమతుల్లో అగ్రస్థానంలో నిలిచిందని, ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ఇది వెన్నెముకగా మారిందని గుర్తుచేశారు. అయితే మన రాష్ట్రంలో క్రాస్ బ్రీడింగ్, అక్రమ రవాణా, సరైన మౌలిక సదుపాయాల లేమి కారణంగా ఈ జాతి సంఖ్య రెండు నుంచి మూడు వేల వరకు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వేల సంఖ్యలో ఒంగోలు ఆవులు పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు అక్రమంగా తరలిపోయాయని విమర్శించారు. జాతి సంరక్షణ కోసం ప్రతి ఒంగోలు ఆవుకు ఆర్ఎఫ్ఐడీ డిజిటల్ ట్యాగింగ్ చేసి ట్రాకింగ్ వ్యవస్థ అమలు చేయాలని, రాష్ట్ర సరిహద్దుల్లో కఠిన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అలాగే హర్యానా, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల తరహాలో పశు ప్రదర్శనలు నిర్వహించి ఉత్తమ పశువులకు రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఒంగోలు ఆవుల సంరక్షణ బాధ్యత చేపట్టాలని, స్వచ్ఛమైన దేశవాళీ ఆవు నెయ్యితో స్వామివారికి నైవేద్యం సమర్పించే అవకాశం కల్పించాలని సూచించారు. రైతులకు ఎలైట్ దూడల కొనుగోలుపై 100 శాతం బీమా, సబ్సిడీ కల్పిస్తేనే ఈ విశిష్ట జాతిని భవిష్యత్ తరాలకు అందించగలమని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు.

# నూరు శాతం సీసీ రోడ్ల లక్ష్యం సాధించిన కే.కొత్తపాలెం

**కే.కొత్తపాలెంలో ఎమ్మెల్యే కృషితో రూ.1.24 కోట్లతో 15సీసీ రోడ్ల నిర్మాణం**



**మోపిదేవి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కే.కొత్తపాలెం గ్రామ పంచాయతీ నూరు శాతం సీసీ రోడ్ల లక్ష్యం సాధించింది. 2004లో కృష్ణానదికి భారీ వరదలు వచ్చిన సమయంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నదీ గర్భ గ్రామాలన్నిటికీ నూరు శాతం సీసీ రోడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా పల్లె పండుగ కార్యక్రమం ద్వారా కే.కొత్తపాలెం గ్రామానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. కోటీ 24,10,000లతో 1,930 మీటర్ల మేరకు 15సీసీ రోడ్లు మంజూరు చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సహకారంతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఈ మేరకు నిధులు సాధించారు. తద్వారా ఇప్పటికే కరకట్ట కింద నది వైపు ఉన్న గ్రామంలో 12 సీసీ రోడ్లు, నది వెలుపల ఉన్న గ్రామంలో రెండు సీసీ రోడ్లు నిర్మించారు. గౌడపాలెంలో మిగిలిన 15వ సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి శుక్రవారం ప్రారంభించారు. రూ.10.65 లక్షలు అంచనాతో 165 మీటర్లు పొడవునా ఈ అంతర్గత రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రావి రత్నగిరి, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, నాగాయతిప్ప సొసైటీ చైర్మన్ బల్లా సీతారామ ప్రసాద్, టీడీపీ నాయకులు దోకిపర్తి బాల కోటేశ్వరరావు, పడమట వెంకటేశ్వరరావు, చందన అనిల్, దుట్టా శేషు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఫణికుమార్ తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సూచనల మేరకు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్, ఏఈఈ బొప్పన శ్రీనివాసరావు నిర్మాణ పనులు పర్యవేక్షించారు.

## ఉపాధ్యాయ వృత్తిలో శ్రీనివాసరావు సేవలు మరువలేనివి



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయ వృత్తిలో ఎందరినో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన శ్రీనివాసరావు సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని గురజాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న యలవర్తి శ్రీనివాసరావు పదవి విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిణి ఐ.పద్మరాణి, పమిడిముక్కల మండల విద్యాశాఖ అధికారి –2 శ్రీనివాసరావు, పెదపారుపూడి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, గ్రామ ఉపసర్పంచ్ సుకూర్ ఖాన్ తదితరులు పాల్గొని శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్క రించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు శ్రీనివాసరావు బంధుమిత్రులు పాల్గొన్నారు.

# పాఠశాలకు రెండు ఇనుప బీరువాలు బహుకరణ




**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రముఖ దాతలు, గతంలో కూడేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి, రిటైర్ అయిన కీ.శే. నత్తా సువర్ణ డేవిడ్ రాజు జ్ఞాపకార్థంగా వారి కుమారుడు నత్తా రాజేంద్ర కుమార్ (రైల్వే డిపార్ట్మెంట్ ఉద్యోగి) 20 వేలు రూపాయలు ఖరీదు చేసే రెండు ఇనుప బీరువాలు బహుకరించారు. ఈయన ప్రస్తుతం హైదరాబాదులో నివాసం ఉంటున్నప్పటికీ గతంలో అనేక సంవత్సరాలు కూడేరు గ్రామంలో నివసించి, ఐనపూరు జడ్పీ హైస్కూల్లో చదువుకున్నారని, గ్రామం మీద అభిమానంతో, పాఠశాల మీద ప్రేమతో, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే ఆలోచన చేసి పాఠశాలకు అవసరమైన 20 వేలు రూపాయలు ఖరీదు చేసే రెండు ఇనుప బీరువాలను బహుకరించినట్లు దాత నత్తా రాజేంద్రకుమార్ తెలియజేశారు. ఈ రెండు ఇనుప బీరువాలను పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ దూడల శివ నాగ భవాని, కూడేరు, ఐనపూరు గ్రామాల సర్పంచులు కొండా జయలక్ష్మి బసివిరెడ్డి దంపతులు, వీర్ల నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు వీర్ల ఆదిశేషు, పాఠశాల దాతల కమిటీ సభ్యులు కొండా రాజగోపాల్ రెడ్డి తదితరుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎంసి కమిటీ చైర్మన్ నాగభవాని మాట్లాడుతూ గత 9 నెలల కాలంలోనే పాఠశాలకు షుమారుగా 2 లక్షల 50 వేలు రూపాయలు ఖరీదు చేసే వస్తు సామాగ్రిని, దాతల సహకారంతో పాఠశాలకు సమకూర్చుకోగలిగామని తెలియజేశారు.

ప్రధానోపాధ్యాయులు వేణుగోపాలరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు అందరికీ పాఠశాల విద్యా కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ దాతల దాతృత్వాన్ని కొనియాడారు. విద్యార్థులందరూ బాగా చదువుకుని, గొప్ప స్థాయికి ఎదిగి, కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు మంచి పేరు తీసుకురావడంతో పాటు, సమాజ అభివృద్ధికి కూడా తమ శక్తి మేర కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మొవ్వలో ఉచిత మెగా వైద్య శిబిరం



**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన మొవ్వ శ్రీ మండవ జానకిరామయ్య సులోచన క్షేత్రయ్య కళ్యాణ మండపంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ టీ.డీ.జనార్ధన్ తెలిపారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో రక్తనాళాల పరీక్షలు, గుండె , జనరల్ వైద్య శిబిరం, ఇ.సి.జి.,బి.పి., షుగర్, ఇతర రక్త పరీక్షలు, కంటి పరీక్షలు,దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందించనున్నామని తెలిపారు. శుక్లాలు నిర్ధారించిన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయబడునని, అవసరమైన వారికి క్యాన్సర్ పరీక్షలు కూడా నిర్వహించానున్నామన్నారు. ఈ ఉచిత వైద్య సేవలు పొందగోరు వారు తమ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకుని ఉచిత వైద్య శిబిరానికి రావాలని, శిబిరంలో అందిస్తున్న ఉచిత వైద్య సేవల్ని మొవ్వ పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకొని తమ ఆరోగ్యాన్ని పదిలపరచుకోవాలని జయప్రద ఫౌండేషన్ చైర్మన్ జనార్ధన్ తెలిపారు.

## నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో యల్.బి.ఆర్.సి.ఈ ఎన్.ఎస్.ఎస్ విద్యార్థుల ప్రతిభ



**మైలవరం, మేజర్ న్యూస్ :** బీహార్ రాష్ట్రం, భాగల్పూర్ లోని మార్వారి కళాశాలలో, తిల్కా మాంఝీ భాగల్పూర్ విశ్వవిద్యాలయం (టి ఎం బి యు (ఆధ్వర్యంలో నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ ( ఎన్ ఐ సి) ఒక వారం రోజుల పాటు విజయవంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కే అప్పారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుండి విద్యార్థులు పాల్గొని జాతీయ ఐక్యత, సాంస్కృతిక వైవిధ్యంపై అవగాహన పొందారన్నారు. ఈ క్యాంప్‌కు ఎన్టీఆర్ జిల్లా లోని లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ నుంచి ఆంధ్రప్రదేశ్ కాంటింజెంట్ లీడర్‌గా డా.బి.ఎస్.హరి ప్రసాద్ హాజరుకాగా, విద్యార్థులు పీ. సౌజన్య, పి.లలిత, వి. రవెంత్, సి.హెచ్. చరణ్ పాల్గొన్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అతిథి ఉపన్యాసాలు, అవగాహన సెషన్లు, వివిధ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. నిర్వహించిన రంగోలి పోటీలో ఆంధ్రప్రదేశ్ టీమ్ మొదటి బహుమతి సాధించి ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. అలాగే కల్చరల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో పంజాబ్ టీమ్‌తో సంస్కృతుల పరస్పర మార్పిడి పోటీలతో జాతీయసమైక్యతను నిరూపించుకున్నారు అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని , విద్యార్థులను, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.బి.శివ హరి ప్రసాద్ కు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు , వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సలీమున్నీసా విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని కృష్ణాపురం అంగన్ వాడి కేంద్రం వద్ద ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయరాదని ఆ విధంగా చేసినట్లయితే చట్టరీత్యా నేరమని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.. ప్రతి ఒక్కరు ఉన్నత విద్యావంతులుగా ఎదిగేలా తల్లిదండ్రులు చూడాలని, ప్రజలు కూడా ఎక్కడ బాల్యవివాహాలు జరగకుండా చూడాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి కార్యకర్తలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.



## ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై విస్తృత చైతన్య సదస్సులు

### ఎన్‌టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) ఆధ్వర్యంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వారి మార్గనిర్దేశనంతో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై విస్తృతంగా అవగాహన సదస్సులు జరుగుతున్నాయని ఎన్‌టీఆర్ జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు తెలిపారు. శుక్రవారం సూరంపల్లిలోని సీఐపీఈటీలో జరిగిన అవగాహన కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి మధు మాట్లాడుతూ శుక్రవారం తిరువూరు, ఎ.కొండూరులో కూడా వర్క్‌షాప్‌లు నిర్వహించినట్లు వివరించారు. గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని సాకారం చేసే దిశగా సమష్టి కృషి అవసరమన్నారు. ఎంఎస్‌ఎంఈల స్థాపన, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సొంతగా యూనిట్లు స్థాపించి పది మందికి ఉపాధి కల్పించగల స్థాయికి యువత ఎదగాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ పరిశ్రమలు స్థాపించాలని పరిశ్రమల అధికారి ఎం.మధు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ఏడీ ఎస్.బాలసుబ్రహణ్యం, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్లు పి.మనీషా, ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఉపాధ్యాయ సంఘం ధర్నా



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రాష్ట్రస్థాయి విద్యారంగ ఆర్థిక సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి వి సాంబశివరావు,అవనిగడ్డ జోన్ కన్వీనర్ జిల్లా కార్యదర్శి చీర్ల నాగప్రసాద్, జిల్లా కార్యదర్శి వై వి కృష్ణ కాంత్, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగరాజు నాలుగు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు బి.లలిత కుమారి, కె గోవర్ధన్, యమ్ వి రమణ, యమ్ శ్యామ్ ప్రసాద్, పి దుర్గా ప్రసాద్,రాష్ట్ర కౌన్సిలర్ జి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు యన్ ధర్మజ్ఞాని,కె గరిధర్, జి రోహిణి కుమార్, యమ్ వి యన్ వి కేశవరావు, యు వి కృష్ణా రావు కె శరత్, చీర్ల రత్తయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## మొబైల్ కోర్ట్‌లో జరిమానా విధింపు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఆరోగ్య సమస్యలు సృష్టిస్తున్న వారిని కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారులు గుర్తించి మొబైల్ కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జి జి. లెనిన్ బాబు విచారించి సమస్యలకు కారణ మైన వారికి జరిమానా విధించారు. సర్కిల్- 1 కార్యాలయంలో శుక్రవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంచార న్యాయస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై చెత్త, చెదారం వేసిన వారితో పాటు, రహదారుల పై జంతువులు, పెంపుడు కుక్కలను వదలినవారు, కాలువల్లో వ్యర్థాలు వేసి మురుగుపారుదలకు ఆటంకం కలిగించివారు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిని గుర్తించి 17 కేసులు నమోదు చేసి వారిని జడ్జ్ ముందు హాజరుపరిచారు. విచారించిన జడ్జి వారికి అపరాధ రుసుం విధించగా అధికారులు రూ. 3,150/-వసూలు చేశారు. అధికారులు ఏఎంహెచ్1 అన్నపూర్ణ, సోమరాజు, శ్రీధర్, శానిటరీ సూపర్వైజర్సులు , శానిటరీ ఇన్స్పెక్టర్లు జి. రంగారావు,గుడ్. శ్రీనివాస్ రావు , శామ్యూల్ దుర్గా రావు, వి. శ్రీనివాస్ రావు, డి. రాజు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాక





### విమానాశ్రయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలి

### రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి శ్యామల రావు

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** వచ్చే మార్చి నెల 1 వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాక సందర్భంగా గన్నవరం విమానాశ్రయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి శ్యామల రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయంలో ఉపచారిక విశ్రాంతి( సెరిమోనిఎల్ లాంజ్) భవనంలోనీ రిజర్వ్ లాంజ్, సెక్యూరిటీ చెక్, నిర్గమన ప్రదేశాలను రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ప్రధాన కార్యదర్శి పరిశీలించారు. అనంతరం కృష్ణ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు లతో కలిసి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటన ఏర్పాటుపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శ్యామలరావు మాట్లాడుతూ వచ్చే మార్చి నెల ఒకటో తేదీన ప్రధాన న్యాయమూర్తి మధ్యాహ్నం తిరుపతి నుండి విమానంలో బయలుదేరి గంటలకు గన్నవరం విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.20 గంటలకు చేరుకుంటారన్నారు.. వారు అమరావతి, విజయవాడలో పలు కార్యక్రమాలలో పాల్గొని అదే రోజు సాయంత్రం 6:30 గంటలకు మరల గన్నవరం విమానాశ్రయం నుండి న్యూఢిల్లీ వెళతారన్నారు. ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం, వీడ్కోలు కార్యక్రమాలను ప్రోటోకాల్ ప్రకారం ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు. ప్రధాన న్యాయమూర్తి ప్రయాణించే మార్గంలో వాహన శ్రేణి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు నివారించే యంత్ర సామాగ్రి సరిగా పనిచేస్తున్నాయా లేదా ఒకసారి గమనించాలన్నారు. వైద్య సహాయం కోసం అంబులెన్స్, సమీపంలోని ఆసుపత్రులను సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ పర్యటనలో విమానాశ్రయం డైరెక్టర్ ఎంఎల్ కే. రెడ్డి , టర్మినల్ ఇన్చార్జ్ అంకిత్ కుమార్, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం , గుడివాడ ఆర్డీఓ జి బాలసుబ్రమణ్యం, ఆర్టీవో ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాసరావు, డిఎంహెచ్వో డాక్టర్ యుగంధర్, గన్నవరం డిఎస్పి శ్రీనివాసరావు, విమానాశ్రయం సిఎస్ఓ ధర్మేంద్ర, విద్యుత్ శాఖ ఇంజనీర్ సౌజన్య, గన్నవరం తహసిల్దారు శివయ్య, ఎంపీడీవో మాధవిలత తదితర అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల కుట్రను భగ్నం చేసిన కృష్ణాజిల్లా పోలీసులు



### సైబర్ నేరగాళ్ల కుట్రను భగ్నం చేసిన కృష్ణాజిల్లా పోలీసులు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ఈడేపల్లి ప్రాంతానికి చెందిన పెద్దిరెడ్డి హరినాథ్ రిటైర్డ్ బెల్ కంపెనీ ఉద్యోగి తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇటీవల ఆయనకు ఒక గుర్తు తెలియని నంబర్ నుండి వీడియో కాల్ రావడంతో లిఫ్ట్ చేయగా, ఫోన్‌లో పోలీసు యూనిఫామ్ ధరించిన వ్యక్తి తాను పూణే నుండి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటిసి) అధికారి అని పరిచయం చేసుకొని, మీపై సీబీఐ కోర్టులో అరెస్ట్ వారెంట్ జారీ అయిందని, నలుగురు ఉగ్రవాదుల ను అరెస్ట్ చేయగా వారి వద్ద నుండి మీ ఏటీఎం కార్డు స్వాధీనం చేసుకున్నామని, మీరు వారికి సహకరించారని ఆరోపిస్తూ "మిమ్మల్ని డిజిటల్‌గా అరెస్ట్ చేస్తున్నాము" అంటూ భయభ్రాంతులకు గురి చేశాడు. నకిలీ అధికారులు వృద్ధ దంపతుల ను ఉదయం నుండి సాయంత్రం వరకు వీడియో కాల్‌లోనే ఉంచి, వారి ప్రతి కదలికపై నిఘా ఉంచుతూ మానసిక ఒత్తిడికి గురిచేశారు. ఈ సందర్భంగా ఇంట్లో అద్దెకు ఉంటున్న మణి అనే వ్యక్తి వారి అనుమానాస్పద పరిస్థితిని గమనించి ఆరా తీయగా, "నేను డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నాను" అని హరినాథ్ చెప్పడంతో ఇది సైబర్ మోసం కావచ్చని అనుమానించి వెంటనే చిలకలపూడి పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న వెంటనే చిలకలపూడి సీఐ షేక్ అబ్దుల్ నబీ వారి ఇంటికి చేరుకొని వృద్ధ దంపతులకు భరోసా ఇచ్చి ధైర్యం కల్పించారు. అనంతరం సదరు నకిలీ పోలీసులను వీడియో కాల్‌లోకి తీసుకుని వెనుక నుండి ప్రశ్నించగా, కంగుతిన్న సైబర్ మోసగాడు వెంటనే కాల్ కట్ చేసి పరారయ్యాడు. ఈ సందర్భంగాచిలకలపూడి సీఐ షేక్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు ఆదేశాల మేరకు ప్రజల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, "డిజిటల్ అరెస్ట్" అనే పదం చట్టంలో ఎక్కడా లేదని, ఇది పూర్తిగా సైబర్ నేరగాళ్ల పన్నాగమని తెలిపారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని ఈ తరహా మోసాలు చేసి కోట్లు కొల్లగొడుతున్నారని, ఎవరైనా పోలీసుల పేరుతో వీడియో కాల్ చేసి బెదిరించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ప్రతినెల ప్రజా సేవల ప్రతిబింబం

### విజన్ యాక్షన్ ప్లాన్ @2047 జనవరి నెల సంచిక విడుదల



**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** శుక్రవారం సాయంత్రం బీఆర్ టీఎస్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వర రావు ప్రతినెల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను "విజన్ యాక్షన్ ప్లాన్ ఏ2047 రూపంలో పుస్తకంగా రూపొందించి ఆవిష్కరించారు. సెంట్రల్ నియోజకవర్గాన్ని 2047 నాటికి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సేవా కార్యక్రమాలు, పీ-4 పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయాలు ఈ పుస్తకంలో సమగ్రంగా పొందుపరచబడ్డాయి. ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో, వారి తనయులు బొండా సిద్దార్థ, రవితేజ అవసరమైన లబ్ధిదారులకు అందిస్తున్న తోపుడు బండ్ల పంపిణీ, ఇస్త్రీ బల్లల పంపిణీ, కుట్టు మిషన్ల పంపిణీ, వినికిడి యంత్రాల పంపిణీ వంటి కార్యక్రమాల వివరాలు ఇందులో చోటు చేసుకున్నాయి.. ఈరోజు సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధికి అంకితమైన "హలో విజయ 2047" జనవరి నెల ప్రత్యేక మ్యాగజైన్‌ను ఘనంగా విడుదల చేయడం జరిగింది. ప్రజల ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రతి నెల నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పారదర్శకంగా ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ మ్యాగజైన్ రూపొందించబడుతోంది.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, "ప్రజల సహకారం, కార్యకర్తల కృషి, యువ నాయకుల సేవాభావంతో సెంట్రల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపే దిశగా కృషి కొనసాగుతుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో:- ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, యంగ్ ప్రొఫెషనల్ వెంకట్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ గౌస్ బాషా, కొమ్మినేని సురేష్, గొట్టుముక్కల వెంకీ , తదితరులు పాల్గొన్నారు.

# పదవికే వన్నె తెచ్చే నాయకుడు ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాల కోటయ్య




విజయవాడ మేజర్ న్యూస్ : ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు నూతన కార్యాలయం విజయవాడ ఎన్టీఆర్ అడ్మిన్ భవన్ ఎరైవల్ బ్లాక్ (బస్ స్టాండ్) 4వ ఫ్లోర్ లో శుక్రవారం ప్రారంభం అయ్యింది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథి గా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హాజరయ్యారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ బాలకోటయ్య ను, డైరెక్టర్ లను ఎంపీ శివనాథ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చైర్మన్ బాలకోటయ్య కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందిస్తూ సత్కరించారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ... నిస్వార్థ పరుడైన ప్రజా సేవకుడు పోతుల బాల కోటయ్య.ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ గా పదవీ బాధ్యతలు నిర్వహించటం ఎంతో సంతోషంగా వుందన్నారు.. నిరంతరం ప్రజా సేవకుడిగా ఏ పదవీ ఆశించకుండా పనిచేసిన పోతుల బాలకోటయ్య కు సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ గా పదవి రావడం...ఆ పదవికే వన్నె చేకూరి నట్లుగా భావిస్తున్నారు. నూతన కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దగ్గర సైతం బాలకోటయ్య చేసిన మహత్తర ప్రతిపాదన చర్చకు వచ్చిందన్నారు. బాలకోటయ్య చెప్పిన విధంగా అన్ని సంక్షేమ హాస్టల్స్ కు భారత రాజ్యాంగ నిర్మాత డా. బి ఆర్ అంబేద్కర్ నివాసం పేరు రాజగృహా పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారన్నారు. డాక్టర్. బి ఆర్ అంబేద్కర్ ఆశయాల కోసం పాటుపడే వ్యక్తులంగా పోతుల బాలకోటయ్య ఇచ్చిన సూచనలు అమలు చేసేందుకు కృషి చేస్తామని ఎంపీ శివనాథ్ తెలిపారు. చైర్మన్ పోతుల బాలకోటయ్య మాట్లాడుతూ....ఎంపీ కేశినేని చిన్ని సహకారంతో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ గా శాఖ అభ్యున్నతికి పాటుబడతా అన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు నాపై ఉంచిన నమ్మకానికి అణుగుణంగా పనిచేస్తా...అని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టల్ ల స్థితిగతులు బాగోగులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరంగా నివేదిక ఇవ్వడం జరిగిందని, వసతి గృహాలకు రాజగృహా పేరు పెట్టేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు గూడపాటి పద్మ శేఖర్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సొంగ సంజయ్ వర్మ, టి ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్ సాయి, విజయవాడ అర్బన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు జీవీ నరసింహారావు పాల్గొన్నారు.

# జన గణన.. దేశ ప్రగతికి సరికొత్త మైలురాయి

## నిబద్ధతతో డేటా సేకరణ విధులు నిర్వర్తించాలి

## ప్రతి విషయంపైనా స్పష్టత అవసరం

## జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



విజయవాడ, సెప్టెంబర్ 27, మేజర్ న్యూస్ : జన గణన అనేది దేశ ప్రగతికి సరికొత్త మైలురాయి అని.. నిబద్ధత, పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్ద పీట వేస్తూ డేటా సేకరణ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. శుక్రవారం విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాలలో సెన్సస్–2027కు సంబంధించి తొలిదశ (హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్)పై జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మార్చి 1 వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెన్సస్ ప్రాధాన్యత, సమాచార సేకరణ విధివిధానాలు, మొబైల్ యాప్స్‌తో పాటు వివిధ డిజిటల్ వేదికలు, ప్రత్యేకంగా కేటాయించిన విధులపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా స్వచ్ఛమైన డేటా సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని మొదటి దశ హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్ (హెచ్ఎల్‌వో), రెండో దశ పాపులేషన్ ఎన్యూమరేషన్ (పీఈ) అని వివరించారు. ఈసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణకు ఒక ప్రత్యేకత ఉందని మొట్టమొదటి సారిగా డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందని చెప్పారు. విధాన అభివృద్ధి, సామాజిక అవసరాలను సరైన విధంగా అర్థం చేసుకునేందుకు జన గణన ముఖ్యమని.. కచ్చితమైన ప్రణాళిక, వనరుల కేటాయింపునకు కీలకమన్నారు. అందువల్ల ఈ బహత్తర కార్యక్రమంలో పాల్గొనే ప్రతిఒక్కరూ అంకితభావంతో సేవలందించాలని జేసీ ఇలక్కియ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, సెన్సస్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ జి.ప్రసన్నకుమార్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏఎస్‌వోలు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# ఘంటసాలలో ముగిసిన చేనేత కార్మికుల సమర్థ్ ట్రైనింగ్



ఘంటసాల, మేజర్ న్యూస్ : చేనేత పనిలో వృత్తి నైపుణ్యం కోసం సమర్థ్ శిక్షణ పొందిన కార్మికులు జీవనోపాధి పెంపొందించుకోవాలని విజయవాడకు చెందిన వీవర్స్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.జ్ఞాన శేఖరన్ అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాలలో శ్రీ జలధీశ్వర ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో విజయవాడలో కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన వీవర్స్ సెంటర్ వారి సహకారంతో చేనేత కార్మికులకు 45 రోజుల పాటు సమర్థ్ శిక్షణ శుక్రవారం ముగిసింది. ఏడీ జ్ఞాన శేఖర్ మాట్లాడుతూ చేనేత కార్మికులు శిక్షణ ద్వారా నైపుణ్యంతో పాటు జీవనోపాధి మెరుగు పర్చుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక, డిజైన్లు, నేర్చుకున్న కార్మికులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెంది పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన చేనేత కార్మికులకు మగ్గాలు, రాట్నాలు, అచ్చులు, డాబీలు, చేనేత పరిశ్రమకు అవసరమైన ఇతర పరికరాలను 10 శాతం కార్మికుని భాగస్వామ్యంతో 90 శాతం సబ్సిడీ పై ఇప్పించడంతో పాటు ముద్ర లోన్లు కూడా తీసుకోవచ్చునని ఏడీ తెలిపారు.45 రోజుల పాటు సమర్థ్ శిక్షణ పొందిన 20 మంది చేనేత కార్మికులకు పరీక్ష నిర్వహించారు.శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెంది పలువురికి ఉపాధి కల్పించి ఆదర్శంగా నిలవాలని వీవర్స్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.జ్ఞాన శేఖరన్ ఆకాంక్షించారు. అతిథులను సొసైటీ ప్రెసిడెంట్ అందె జగదీష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన కార్మికులు ఘనంగా సత్కరించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ ఢిల్లీ బాబు, ఆఫీసర్ నిరంజన్, మాజీ ఎంపీపీ అందె సూర్యభవాని, మాస్టర్ ట్రైనర్ వుడతా చిత్తరంజన్ సాయి, అసిస్టెంట్ మాస్టర్ ట్రైనర్లు తుమ్మలచర్ల నాంచారమ్మ, జంజనం రామమోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజా సేవలో ముందుండే నాయకత్వం

### అభివృద్ధి సంక్షేమానికి ప్రతీక ఎమ్మెల్యే బొండా ఉమా

విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ : శుక్రవారం సింగ్ నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమం ప్రజల విశేష స్పందనతో విజయవంతంగా జరిగింది. ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శాసనసభలో అభివృద్ధి అంశాలపై గళమెత్తి మాట్లాడటమే కాకుండా, కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని కొనియాడారు. సెంట్రల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్న నాయకుడు బొండా ఉమా గారేనని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, పేదల సంక్షేమం వంటి అంశాలలో ఎమ్మెల్యే నిరంతరం శ్రద్ధ చూపుతున్నారని, ప్రజల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, స్వయం ఉపాధి పథకాలు, చిన్న వ్యాపారులకు ఆర్థిక సహాయం వంటి అంశాల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులతో సమన్వయం చేసి, నిర్దిష్ట గడువులో పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, వారి సమస్యలను తమవిగా భావించడం బొండా ఉమా ప్రత్యేకత అని బొండా సిద్ధార్థ అన్నారు. సెంట్రల్ నియోజకవర్గాన్ని సమస్యలేని ప్రాంతంగా తీర్చిదిద్దడమే ఎమ్మెల్యే లక్ష్యమని, అభివృద్ధి, సంక్షేమం కలిసే నడిచేలా ప్రజలకు నిత్యం అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్,యవాడ సెంట్రల్ సివిఏపి (నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్) స్పెషల్ ఆఫీసర్ నాగ మల్లేశ్వర రావు, జోనల్ కమీషనర్ ప్రభు దాసు , సిడిపో జగదీశ్వరి, స్వర్ణాంధ్ర ఏ2047 టీమ్,హౌసింగ్ ఏఈ ఇర్ఫాన్ , యంగ్ ప్రొఫెషనల్ వెంకటేష్, సివిఏపి టీమ్ డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులు, అధికారులు, సివిఏపి టీమ్ సభ్యులు, ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడేను డ్రై డే గా పాటించాలి



విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు నగర ప్రజలందరూ ప్రతి ఫ్రైడే ను డ్రై డే గా పాటించాలని విజయవాడ నగర పాలక సంస్థ బయాలజిస్ట్ వి కామేశ్వరరావు ప్రజలతో అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం రాధా నగర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వివిఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే, డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయోలజిస్ట్ కామేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ యుపిహెచ్ సి ఆర్. పద్మావతి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో ఉత్సాహంగా స్టూడెంట్ ఎల్ఈడి కాన్ఫరెన్స్










**విజయవాడ మేజర్ న్యూస్ :** ఈ చాంప్స్, ఫస్ట్, సెకండ్ క్లాస్ స్టూడెంట్స్ ఎల్ఈడి కాన్ఫరెన్స్ శుక్రవారం నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్‌కు ముఖ్య అతిధిగా డైరెక్టర్ పొంగూరు రమాదేవి విచ్చేసి తల్లిదండ్రులతో ఇంట్రాక్ట్ అయి స్కూల్ కరుకలం గురించి ఎలా ఉందో తెలుసుకున్నారు. తల్లిదండ్రులు దగ్గర నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. అ లాగే స్టూడెంట్స్‌ని ఎంకరేజ్ చేసి బాగా మోటివేట్ చేశారు. టీచర్స్ చేసిన టిఎల్ఎం అన్ని చాలా బాగున్నాయని ప్రశంసించారు.

ఈ సందర్భంగా క్లస్టర్ ప్రిన్సిపాల్ ముత్తారెడ్డి మాట్లాడుతూ ఇది విద్యార్థి యొక్క అకడమిక్స్ ఎలా ఉన్నయో తల్లిదండ్రులకు కళ్ళకు కట్టినట్లు చూపించే అద్భుతమైన వేదిక అన్నారు. సెకండ్ సెమిస్టర్‌లో జరిగినటువంటి సిలబస్ అన్నీ సబ్జెక్టులు ఇంగ్లీష్, మాథ్స్, హిందీ, తెలుగు, ఇవిఎస్, కంప్యూటర్ అన్ని కార్నర్స్‌గా డివైడ్ చేసి స్టూడెంట్స్‌ని తల్లిదండ్రులు ప్రశ్నలు వేస్తు వారి అకడమిక్ పర్ఫామెన్స్ తెలియచేసే ఒక మంచి ప్రోగ్రాం అన్నారు. ప్రోగాం జరిగిన తర్వాత విద్యార్థిలం దరికి ప్రశంసా పత్రాన్ని ప్రధానం చేశారు.

ఈ కాన్ఫరెన్సులో కోఆర్డినేటర్ జహూర్ ఫాతిమా ఖాన్, ప్రిన్సిపాల్ శ్యామల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ శివపార్వతి, ఈ చాంప్స్ టీచర్స్, పేరెంట్స్ అండ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## అందెలరవళులతో పులకరించిన కూచిపూడి





**మొవ్వ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ కళ్యాణోత్సవాల సందర్భంగా రెండవ రోజైన శుక్రవారం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలతో నాట్య క్షేత్రం కూచిపూడి పులకించింది. కళాకారులు దేవాలయం సమీపంలోని శ్రీ సిద్ధేంద్రయోగి నాట్య కళావేదికపై ప్రదర్శించిన కళా నృత్యనికేతన్ (స్కూల్ ఆఫ్ కూచిపూడి, హైదరాబాద్) డాక్టర్ బిందు అభినయ్ విద్యార్థులు గార్గేయి, శాస్త్రి, మోహిష, ఆయుష్ శ్రీ, సంజన, దుర్గ భవాని, మృదున, సమన్వితలు గణపతి అభివృద్ధి, పద్మభూ షణ్ డాక్టర్ వెంపటి చినసత్యం నృత్య దర్శకత్వంలో రూపొందించిన కృష్ణ శబ్దం, ఆనంద తాండవం అంశాలను ప్రదర్శించారు. మధుసూదన్, శ్రీనిధిలు కదిరి నృసింహుడు, శివరంజని తిల్లానాలను ప్రదర్శించారు. శ్రీ సిద్ధ డాన్స్ అకాడమీ (వరంగల్) నిర్వాహకురాలు నాట్యచారిణి డి.ఝాన్సీ విద్యార్థిని టి శ్రీవేద భామాకలాపం ప్రవేశ దరువు, మామవతు శ్రీ సరస్వతి అంశాలను ప్రదర్శించారు. అలాగే గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ వై. లలితసింధూరి ముదాకరాత్తమోదకం, శంకర శ్రీగిరి నాద ప్రభో, ఏమి చేతురాలింగ నేనేమీసేతురా అంశాలను ప్రదర్శించారు. ఉమానృత్యనికేతన్ నిర్వాహకు రాలు రెడ్డి ఉమారాణి(రాజమండ్రి) బ్రహ్మాంజలి కామాక్షి అంశాలను ప్రదర్శించారు. నాట్యాచార్య నృత్య భూషణ్ విజయ్ కుమార్ బృందం (కేరళ) భరతనాట్యం, మోహిని అర్థం కూచిపూడి నాట్యాలను విజయ్ కుమార్, లైలా దంపతులు శ్రీదేవి శ్రీకళ అజయన్లు ప్రదర్శించిన నాట్ అంశాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కళాకారులను శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ పాలకమండలి సభ్యులైన కళారత్న రాధేశ్యామ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



## భక్తిశ్రద్ధల మధ్య వీరవల్లిలో తిరుపతమ్మగోపయ్య తిరునాళ్ల ఆరంభం



### పట్టు వస్త్రాలు సమర్పించిన లంక వంశస్తులు



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 27, మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ తిరుపతమ్మగోపయ్య స్వామివార్ల తిరునాళ్లు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి ఏడాది లంక వంశస్తులు పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీ ప్రకారం, లంక బాబు సురేంద్ర మోహన్ బెనర్జీ నివాసం నుంచి మేళతాళాల నడుమ ఊరేగింపు ప్రారంభమైంది. ఈ సందర్భంగా లంక రవి శ్రీనివాస్, శ్రీలక్ష్మి, లంక హరీన్ తదితరులు భక్తులతో కలిసి ఆలయం వరకు శోభాయాత్రగా వెళ్లారు. దేవాలయం వద్ద అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లంక రవి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరునాళ్ల తొలి రోజు నాలుగు దంపతులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు. కళ్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు దేవాలయ చైర్మన్ నందమూరి కృష్ణ ప్రసాద్, కలపాల శ్రీధర్ ఆధ్వర్యంలో సక్రమంగా జరిగాయి. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివార్ల ఆశీస్సులు పొందారు.




## విద్యాసామర్థ్యాలు సాధించేలా కృషి

**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్యారెంటీడ్ ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమం వల్ల విద్యార్థుల విద్యాసామర్థ్యాలు మెరుగవుతాయని అంగులూరు డైట్ కళాశాల అధ్యాపకులు మద్దిబాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. కార్యక్రమ అమలు తీరు పరిశీలనలో భాగంగా శుక్రవారం ఆయన మండల పరిధిలోని పోసినవారి పాలెం ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు ఇంగ్లీషు గణితంలో ప్రాథమిక సామర్థ్యాలను పెంపొందించుకోవడంలో జి ఎఫ్ ఎల్ ఎన్ ఉపకరిస్తుందన్నారు. ఆయా పాఠశాలల్లో జిఎఫ్ ఎల్ ఎన్ ప్రణాళిక అమలు తీరును సమీక్షించారు.తెలుగు ఇంగ్లీషు భాషల్లోని అంశాలను విద్యార్థులతో చదివించి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులందరూ విద్యాసామర్థ్యాలలో మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్య, జయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో పెడన కలంకారి వస్త్ర ప్రదర్శనను తిలకించిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మేజర్ న్యూస్:** అమరావతి అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పెడన కలంకారి వస్త్ర ప్రదర్శనను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తిలకించారు. భవిష్యత్తులో తమ నియోజకవర్గంలో కూడా కలంకారి వృత్తిని ప్రారంభించాలని కలంకారి కళాకారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా కోరారు. కలంకారి వస్త్రాలకు డిమాండ్ పెరిగేలా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పెడన కలంకారి తరపున కుమార్ రాజా తల్లి, సతీమణి లకు పెడన కలంకారి వస్త్రాలను బహుమతిగా అందజేశారు.

## సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్(మెన్) టోర్నమెంట్‌కి యల్.బి.ఆర్.సి.ఈ విద్యార్థి ఎంపిక



**మైలవరం, మేజర్ న్యూస్ :** స్థానిక లకి రెడ్డి బాలిరెడ్డి కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ కొరిని సందీప్, సి.ఎస్.ఈ విద్యార్థి, వచ్చేనెల 2 వ తేదీ నుండి – 6 వ తేదీ వరకు భారతిదాసన్ యూనివర్సిటీలో జరుగబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ (మెన్) టోర్నమెంట్‌లో పాల్గొనటానికి జె.యన్.టి.యునివర్సిటీ ,కాకినాడ తరపున ఎంపిక ఐనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పా రావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ,ఫిసికల్ ఎడ్యుకేషన్ విభాదిపతి డా.రాజ్ కుమార్ కు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999